




నారాయణరెడ్డిపల్లి గ్రామం వద్ద పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై కూర్చొన్న పెద్దారెడ్డి

ఎక్కువొచ్చినా కొరతే..!

- యూరియా కోసం రైతులకు తప్పని పాట్లు
- బ్లాక్ మార్కెట్‌కు తరలినట్టు ఆరోపణలు



జల్లాకు యూరియా ఎక్కువొచ్చిన రైతులకు మాత్రం అందుబాటులో లేవు. వచ్చిన యూరియా పక్కదోవ పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా ఆర్ఎస్‌కెల్లోనే అందుబాటులో లేవన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే యూరియా పక్కదోవ పడుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అనంతపురం జల్లాకు ఖరీఫ్‌కు 26,839 మెట్రిక్ టన్నులు అవసరమని అంచనా వేస్తే 27,226 మెట్రిక్ టన్నుల జల్లాలో అందుబాటులో ఉంది. ఇందులో 22 వేల పైచీలుకు అమ్మకాలు సాగినట్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఈ ఏడాది వర్షాలు సరిగా లేక పంటల సాగు ఆశించినంతగా సాగలేదు. సాగునీటి వసతి ఉన్న రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనే ఎక్కువగా వరి, మిరప తదితర పంటలు సాగవుతున్నాయి. సాగు విస్తీర్ణం తక్కువున్నా మార్కెట్‌లో రైతులకు మాత్రం యూరియా తగినంత లభించడం లేదు. ఎక్కడైనా యూరియా కావాలని రైతులొస్తే కాంప్లెక్సు కొంటేనే ఇస్తామన్న షరతులు కూడా పెడుతున్నారు. జల్లాలో ప్రయివేటు డీలర్లు, ఆర్ఎస్‌కెలు, హోల్‌సేలర్లు, సొసైటీల ద్వారా యూరియా అమ్మకాలు సాగుతాయి. ఇందులో అత్యధికంగా ఆర్ఎస్‌కె (రైతుభరోసా కేంద్రాల) ద్వారానే ఎక్కువగా ఉంటుంది. వీటికి మార్క్‌ఫెడ్ ద్వారా కేటాయింపులు జరుగుతాయి. గ్రామ స్థాయిల్లోనే ఆర్ఎస్‌కెలు ఎక్కువగా ఉండటంతో రైతులు తీసుకోవడానికి అనువుగా ఉంటున్నాయి.



యల్లనూరులో రైతుసేవా కేంద్రం యూరియా కోసం బారులు దీరిన రైతులు

ఆర్ఎస్‌కెల్లోనే ఎక్కువ కొరత ఉన్నట్టుగా కనిపిస్తుండటం గమనార్హం.

ఆర్ఎస్‌కెల నుంచి పక్కదారిపై సందేహాలు ?

యూరియా పంపిణీలో కీలకంగానున్న ఆర్ఎస్‌కెల నుంచి పక్కదారి పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఆర్ఎస్‌కెల నుంచి నేరుగా ప్రయివేటు డీలర్ల వద్దకు యూరియా చేరుతుతోందన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. కొంత మంది అధికారుల ప్రమేయం కూడా ఇందులోనున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. అధికారులు మాత్రం పక్కగా పంపిణీ జరుగుతోందని చెబుతుండగా రైతులు అనేక చోట్ల యూరియా కోసం పడిగాపులుగాస్తున్నారు కేటాయింపులే తక్కువగా ఉన్నాయని బొమ్మనహాల్ తదితర మండలాల్లో వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

యూరియా కొరత రానీయొద్దు : చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం అనంతపురం జల్లా కార్యదర్శి

యూరియా కొరత తీవ్రంగా ఉంది. అనేక చోట్ల రైతులు యూరియా కోసం పడిగాపులుగాస్తున్నారు. అధికారులు కొరత లేదని ఒకవైపు చెబుతున్నా ఆచరణలో పరిస్థితులు వేరుగానున్నాయి. పంట సాగు సమయంలో రైతులను ఇబ్బంది పెట్టడం తగదు. యూరియా కొరత లేకుండా తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. అదే విధంగా ప్రయివేటు డీలర్లు అయితే యూరియతోపాటు ఇతర ఎరువులు కొంటేనే ఇస్తామని షరతులు పెడుతున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

రైతులకు యూరియా కష్టాలు

యల్లనూరు : రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. మండల వ్యాప్తంగా అనేకమంది రైతులు మొక్కజొన్న, వరి, అరటి, తదితర పంటలు సాగు చేశారు. ఆయా పంటలకు తప్పనిసరిగా యూరియా వేయాలి. దీంతో మండలంలో యూరియాకు మరింత డిమాండ్ పెరిగింది. ఇదివరకు మార్క్‌ఫెడ్ నుంచి ఎడిసిసి సహకార సంఘం ద్వారా సొసైటీకి యూరియా సరఫరా అయ్యేది. అయితే స్థానిక సహకార సంఘం సొసైటీకి యూరియా రాకపోవడంతో వ్యవసాయ శాఖ ద్వారా యల్లనూరు ఆర్‌బికెకు 12 టన్నులు యూరియా తెప్పించారు. ఈ యూరియా కనీసం వందమంది రైతులకు కూడా సరిపోవడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవ తీసుకుని రైతులందరికీ యూరియా అందేలా చూడాలని కోరుతున్నారు.

పెద్దారెడ్డికి మళ్లీ నో ఎంట్రీ..!

- తాడిపత్రికి వెళ్లనీయకుండా వెనక్కు పంపిన పోలీసులు
- కోర్టు ఆదేశాలు అమలు చేయాలని పెద్దారెడ్డి పట్టు
- రోడ్డుపైనే ఆరుగంటల పాటు బైఠాయింపు
- వచ్చి చూడమన్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

తాడిపత్రి వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మరోమారు తాడిపత్రి పట్టణంలోకెళ్లేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తగిన భద్రత నడుమ తాడిపత్రి పట్టణంలోని ఆయన నివాసానికి తీసుకెళ్లాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పోలీసులు అమలు చేయించలేకపోయారు. సోమవారం ఉదయం పెద్దారెడ్డి తన నివాసం యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామం నుంచి తాడిపత్రికి వెలుతున్న సమయంలో పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. తాను తన ఇంటికెళితే వచ్చే సమస్య ఏమిటో చెప్పాలని పోలీసులను పెద్దారెడ్డి ప్రశ్నించారు. శాంతిభద్రతల నేపథ్యంలో తాడిపత్రికి వెళ్లేందుకు వీల్లేదని పోలీసులు చెప్పడంతో పెద్దారెడ్డి రోడ్డుపైనే దాదాపు ఆరుగంటల పాటు కూర్చీవేసుకుని బైఠాయించి నిరసన చేపట్టారు.

16 నెలలుగా తాడిపత్రికెళ్లేందుకు అడ్డంకులు

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 16 నెలలుగా తాడిపత్రి పట్టణంలో అడుగుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. పెద్దారెడ్డి వస్తే అడ్డుకుంటామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే శాంతిభద్రతల సమస్య వస్తుందని పోలీసులు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు తనను అడ్డుకోకుండా తాడిపత్రి పట్టణంలోకి అనుమతించాలని కోరారు. కోర్టు ఆయన్ను ఐదు వాహనాల్లో తాడిపత్రి పట్టణానికి వెళ్లేందుకు తగిన భద్రత కల్పించాలని ఇటీవల ఆదేశించింది. అయితే వివిధ కారణాలను చూపుతూ పోలీసులు పెద్దారెడ్డిని అనుమతించకుండా వాయిదాలు వేస్తూ వస్తున్నారు. దీంతో ఆయన పోలీసుల తీరుపై మళ్లీ కోర్టును ఆశ్రయించారు. ఈనెల 18వ తేదీన సోమవారం నాడు తగిన భద్రతతో ఆయన్ను తాడిపత్రిలోని ఇంటికి తీసుకెళ్లాలని కోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం నాడు పెద్దారెడ్డి తాడిపత్రి పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా కారణాలతో పోలీసులు అనుమతించలేదు. పుట్లూరు మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామం వద్దకు రాగానే నిలిపివేశారు. తాడిపత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహ ప్రతిష్టను మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి సోమవారం చేపట్టారు. ఈ నేపథ్యంలో జెసి మద్దతుదారులు పెద్ద సంఖ్యలో అక్కడికి వచ్చారు. ఇదే సమయంలో పెద్దారెడ్డిల అక్కడికి వెళ్తే ఘర్షణ జరిగే అవకాశముందన్న కారణంతో పోలీసులు తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు.

జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు ఆపుతున్నారు : పెద్దారెడ్డి

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పోలీసులు తనను తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని పెద్దారెడ్డి ఆరోపించారు. తాను వెళితే శాంతిభద్రతల సమస్య వస్తుందని పోలీసులు చెబుతున్నారన్నారు. జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆయన తనయుడు అస్మిత్‌రెడ్డిలు తాడిపత్రి పట్టణంలో యథేచ్ఛగా తిరుగుతున్నా సమస్యలేదనా ప్రశ్నించారు. సమస్య ఉంటే ఇద్దరినీ బయటకు పంపించాలి కదా అన్నారు. కోర్టు ఉత్తర్వులున్నా పోలీసులు లెక్క చేయకుండా వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై మరోమారు కోర్టును ఆశ్రయిస్తానని చెప్పారు.

పెద్దారెడ్డి బాధితులు అడ్డుకుంటున్నారు : జెసి.ప్రభాకర్‌రెడ్డి

తాను పెద్దారెడ్డి పర్యటను అడ్డుకోవడం లేదని వైసిపి ప్రభుత్వంలో ఆయన వల్ల నష్టపోయిన బాధితులే అడ్డుకుంటున్నారని జెసి.ప్రభాకర్‌రెడ్డి తెలియజేశారు. పెద్దారెడ్డి ఎమ్మెల్యేగానున్న సమయంలో తాడిపత్రిలో చాలా మందిని ఇబ్బంది పెట్టారన్నారు. అందువల్లే ఆయన్ను అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో వారు అధికారులో ఉన్న సమయంలో కోర్టు ఆదేశాలను వారెందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు.



ఢీకొన్న టెంపోట్రావెలర్.. ఆర్టీసీ బస్సు

విషాదయాత్ర..!

- టెంపోట్రావెలర్, ఆర్టీసీ బస్సు ఢీ
- నలుగురు మృతి.. 9 మందికి గాయాలు

తిరుమల దైవ దర్శనం పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం వెంటాడింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అవ్వా మనువరాలు, టెంపో డ్రైవర్, మరో వ్యక్తి మరణించారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు మండలం మండ్లిపల్లి వద్ద సోమవారం ఉదయం చోటు చేసుకున్న ఈ ప్రమాదం బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నిపింది.

వార్త మెయిన్‌లో

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

'అన్నదాత సుఖీభవ' కృతజ్ఞత ర్యాలీలో మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

అన్నదాతల బాగు కోరుకునే ప్రభుత్వం తమదని, రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు అని మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇటీవల రైతుల ఖాతాల్లో 'అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్' పథకం తొలి విడత నిధులు జమ అయిన సందర్భంగా సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మంత్రి సవిత ఆధ్వర్యంలో రైతులు సుమారు పది కిలీమీటర్ల మేర భారీ ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టారు. ర్యాలీ సోమందేపల్లి నుంచి పెనుకొండ మార్కెట్ యార్డ్ వరకూ నిర్వహించారు. యార్డ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతు పచ్చగా ఉంటేనే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనేది సిఎం చంద్రబాబు ప్రగాఢ విశ్వాసమన్నారు. రైతులకు పంట పెట్టుబడి కోసం 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని ప్రవేశపెట్టి ఏడాదికి రూ. 20 వేలు అందజేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. తొలి విడతగా ఇప్పటికే రూ. 7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారని, రెండో విడతగా రూ. 7 వేలు, మూడో విడతగా రూ.6 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటు రాయితీపై విత్తనాలు, ఎరువులు, డ్రోన్లు, డ్రిప్, స్ప్రింక్లర్లు



ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి సవిత

అందజేస్తున్నామన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ర్యాలీలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప పాల్గొన్నారు. అంతకుముందు నియోజకవర్గంలోని రైతులు పెద్దఎత్తున ట్రాక్టర్లతో తరలిరావడంతో సోమందేపల్లి-పెనుకొండ రహదారికి కిక్కిరిసిపోయింది. పెనుకొండ పట్టణం రైతుల నినాదాలతో మార్మోగింది.

మార్కెట్ యార్డుల ఛైర్మన్లు, సింగిల్ విండో అధ్యక్షుల ప్రమాణస్వీకారం

పెనుకొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా బొక్సంపల్లి రామకృష్ణప్ప, గోరంట్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా శైలజ, డైరెక్టర్లు మంత్రి సవిత సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వినుకొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా రామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే ఇస్లాపురం, కలిపి, చాలకూరు, పరిగి, రొద్దం, గోరంట్ల సొసైటీల అధ్యక్షులు, సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు.

రొద్దం : పెనుకొండలో మంత్రి సవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ ర్యాలీ, పెనుకొండ మార్కెట్ యార్డ్ ఛైర్మన్, డైరెక్టర్లు, మండలంలోని సింగిల్‌విండో అధ్యక్షులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు రొద్దంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు, ప్రజలు భారీగా ట్రాకర్లలో తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో టిడిపి నాయకులు మాధవనాయుడు, నరహరి, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, తిరుపాల్ నాయుడు, వీరాంజి, శ్రీనాథ్‌చౌదరి, సిద్దన్న, చెన్నకేశవులు, మధు, రమణ, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా.. మారని బీడీ కార్మికుల బతుకులు

బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ జి.ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ప్రభుత్వాలు మారుతున్నా.. బీడీ కార్మికుల జీవితాలు మారడం లేదని ఎపి బీడీ, సిగార్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులు అన్నారు. సోమవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్‌జిఓ హోంలో ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో మొదటి మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రితోపాటు పరిసర ప్రాంతాల్లో దాదాపు 7వేల మందిపైగా బీడీ కార్మికులు ఉన్నారన్నారు. వీరు బీడీ పనులు తప్ప ఏ పనీ చేయలేరన్నారు. అలాంటి వారి శ్రమను ఆయా పరిశ్రమలు దోచుకుంటూ హక్కులను కాలరాస్తున్నాయన్నారు. 1966, 1976 కార్మిక, సంక్షేమ చట్టాలను రద్దు చేసిబీడీ కార్మికులను ఆదుకుంటామని పార్లమెంటులో చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇంతవరకూ వాటిపై కనీస వివరాలు సేకరించకుండా నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. తాడిపత్రిలో బీడీ కార్మికులకు ఇళ్లస్థలాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. తాడిపత్రి కార్యదర్శిగా రహీంబి కోశాధికారిగా ఆరిఫా, ఉపాధ్యక్షులుగా షాను, సహాయ కార్యదర్శులుగా మాబున్నీ, బేబీ, బసిరున్, షాహిదా, శాను, గౌరవాధ్యక్షులుగా ఉమాగౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరసింహారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతురెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బెహలూల్ షా బాబా ఉరుసు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్


పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన హజ్రత్ సయ్యద్ బెహలూల్ షా ఖాద్రీ షహీద్ ఉరుసు ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా తరహాలోనే ముస్లిం క్యాలెండర్ ప్రకారం సఫర్ మాసంలో దర్గా పీఠాధిపతి ఆదోని షెక్షావలి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా 19వ తేదీ జెండా ఆవిష్కరణ, 20న గంధం, 21న దీపారాధన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల సమయంలో కులమతాలకు అతీతంగా భక్తులు బాబా దర్గాను దర్శించుకుంటారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

అగ్రహారంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మడకశిర : అమరాపురం మండలంలోని అగ్రహారం పంచాయతీ లో సోమవారం వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్ కరపత్రాను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ త్రిలోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

అగళి : మండలంలోని ఆలుడి, కొమరేపల్లి గ్రామాల నుంచి సుమారు వంద కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. ఆయా కుటుంబాల వారు సోమవారం మడకశిర పట్టణంలోని టిడిపి కార్యాల యంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పసుపు కండువా వేసుకున్నారు. టిడిపిలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, నియోజక వర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, గుండుమల తిప్పేస్వామి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరామన్నారు. వైసిపికి ఎనలేని సేవలు అందించినా ఆ పార్టీ కానీ, మాజీ ఎమ్మెల్యే కానీ మమ్ములను గుర్తించలేదన్నారు. మండలంలో టిడిపి బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని గుండుమల తిప్పేస్వామి వారికి సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, జడ్పిటిసి ఉమేష్, ఎంపిటిసి సురేష్, మండల కన్వీనర్లు, తిప్పేస్వామి, నాగరాజు, సింగిల్‌విండో అధ్యక్షులు కుమార్‌స్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచప్ప, నాయకులు బసవరాజు, నరసింహప్ప, శివన్న, రాజన్న, నరసింహప్ప, కాంతరాజు, నరసింహప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరిక నాయకులు

గరిమేకలపల్లిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసి దేశానికి మార్గదర్శనం చేశారని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. రామగిరి మండలంలోని గరిమేకలపల్లి గ్రామంలో టిడిపి సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి సహకా రంతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే రాజు, పరిటాల శ్రీరామ్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం గురించి, దేశం, బడుగు, బలహీన వర్గాల కోసం చేసిన కృషిని వివరించారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఇక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సహకరించిన ఎల్.నారాయణ చౌదరికి కతజ్ఞతలు తెలిపారు. మన దేశంలో ఎవరి మతం వారు ఆ దేవుళ్లకు మొక్కుతారని.. కానీ దేశం మొత్తం నమస్కరించేది ఒక్క అంబేద్కర్ కి మాత్రమేనన్నారు. ఇక్కడ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారంటే.. ఇక్కడ చైతన్యం, ప్రశ్నించే వారు ఉన్నారని అర్ధమన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఈ అంబేద్కర్ విగ్రహం ఒక దిక్సూచిగా ఉంటుందని ఎంఎస్ రాజు అభిప్రాయపడ్డారు. అంతకుముందు గ్రామస్తులు బోనాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. డప్పులు వాయిస్తూ, టపాసులు పేలుస్తూ, పూల వర్షం కురిపిస్తూ గ్రామంలో సందడి చేశారు.



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, పరిటాల శ్రీరామ్



వైసిపి నాయకుడు చిరంజీవిని పరామర్శిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, తదితరులు

వైసిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి-మడకశిర

మండలంలోని తురకవాండ్లపల్లి గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు చిరంజీవి కొన్ని రోజుల క్రితం పొలంలో కాలు జారి పడిపోవడంతో కాలు విరిగింది. ఆయన ఆసుపత్రి చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలిసి సోమవారం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్ప ఆ గ్రామం వెళ్లి చిరంజీవిని పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు నరసింహమూర్తి, శేషాద్రి, జగన్నాథ్, రవికుమార్, బాషా, తిప్పన్న, అతావుల్లా, నౌషద్, అంజప్ప ఉన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి : జెసి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

అర్జీదారుల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల వినతుల పట్ల నిర్లక్ష్యం చూపకుండా పారదర్శకంగా పరిష్కరించాలన్నారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన యువ రైతు సందీప్(34) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. సందీప్ ఉదయాన్నే పొలంలో మోటార్ పంపు ఆన్ చేయడానికి వెళ్లాడు. ఎంత సేపైనా ఇంటికి రాకపోవడంతో సందీప్ సోదరుడు పొలానికి వెళ్లి చూడగా విద్యుత్ తీగలకు ఆనుకొని పక్కన పొలంలో పడి ఉండడం గమనించాడు. వెంటనే దగ్గరికి వెళ్లి చూడగా అచేతనంగా పడి ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. సందీప్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సందీప్(ఫైల్‌ఫొటో)

ఆలయ నిర్మాణానికి విరాళం

నల్లచెరువు : నల్లచెరువులో నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. వెంకటనారాయణ రేణుక రూ. 10, 116, మిలిటరీ ఆంజనేయులు రూ. 20,116 అందజేశారు. ఈ కార్యక్రమంలో పడుచూరి నగేష్, కేసీ వెంకటనారాయణ, తలారి రామయ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు

కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఒంగోలు పర్వతారెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఇటీవల జరిగిన 43వ ఆల్ ఇండియా కరాటే ఓపెన్ ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సిద్ధార్థ కరాటే అకాడమీ అధ్యక్షుడు నల్లూరి మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో కదిరి మాస్టర్ షాకీర్ వద్ద శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. 23 మంది కట, కుమితే విభాగాల్లో పాల్గొని పతకాలు సాధించారు. కదిరి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, జైన్, శ్రీశాంతినికేతన్, వాల్మీకి, సాధన, సెయింట్ మేరీ, నారాయణ, శ్రీ చైతన్య, భవిష్య పాఠశాలలు, దీక్ష కళాశాలల విద్యార్థులు, ఓడిసి శ్రీ విజ్ఞాన్ సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు 23 మంది పాల్గొని 19 బంగారు పతకాలు, 13 వెండి పథకాలు, 8 కాంశ్య పథకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు ఒంగోలు ఎస్పీ ఎఆర్ దామోదర్, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మెడల్స్, ప్రశంస పత్రాలను అందించారు. అనంతరం మాస్టర్ షాకీర్‌కు దుశ్శాలువ మెమొంటోతో సత్కరించారు.



సాధించిన పతకాలు, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

నేత్రదానం

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిల్లకొండయ్య పల్లి గ్రామానికి చెందిన మద్దినేని మనోహర్ నాయుడు రమణమ్మల కుమారుడు మద్దినేని ప్రకాష్ చౌదరి (22) అనే విద్యార్థి అనంతపురంలో ఉంటూ సోమవారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో మృతుని తల్లిదండ్రులు సేవా దృక్పథంతో తమ కుమారుడి కళ్లను దానం చేశారు.

విద్యార్థులకు హాకీ స్టిక్‌లు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి శ్రీనివాసులు ప్రస్తుత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హాకీ స్టిక్‌లను సోమవారం పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో చదివినందున పాఠశాల విద్యార్థులకు పదివేల రూపాయలు విలువ చేసే స్టిక్‌లను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని నేవీలో ఉద్యోగం చేస్తున్న శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోపాల్, పీడీలు వెంకటేష్, రామకృష్ణ, అంజన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు పలువురు అధికారుల డుమ్మా

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలు శాఖల మండల అధికారులు గైర్హాజరు అయ్యారు. తమ సమస్యలు తెలుపుకోవడానికి తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే అర్జీదారులు తమ సమస్యలను ఎవరికీ తెలుపుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ దేవేంద్ర నాయక్ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, హాస్టల్ వార్డెన్, ఉపాధిహామీ ఏపీవో, సిరికల్చర్, వెలుగు ఎపిఎం, పోలీస్ శాఖ అధికారులు హాజరు కాలేదని, వచ్చిన కొంతమంది అధికారులు సంతకాలు పెట్టి వెళ్లిపోయారని తెలిపారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో విచారించి సత్వరమే బాధితులకు న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారించి న్యాయపరమైనటువంటి వాటికి సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు , పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి అడిషనల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించని అధికారులు

ప్రజాశక్తి - తాడిమర్రి

మండలంలోని పలు శాఖల అధికారులు సమయపాలన పాటించకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహశీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం తదితర కార్యాలయాల్లో పనిచేసే పలువురు అధికారులు సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 11, 12 గంటలకు ఆఫీసులకు రావడం సాయంత్రం మూడు లేదా నాలుగు గంటల మధ్యలోనే ఆఫీసులను వీడటం చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఉన్న సమయంలో కూడా అధికారులు ప్రజలకు అందుబాటులో లేకుండా బయట కాలక్షేపం చేసి ప్రజల సమస్యలపై పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వీఆర్వోలు, మండల సర్వేయర్లు, తహశీల్దార్ భూముల, రస్తా సమస్యలు పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు పనితీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రయోగాత్మక విద్యను అందించాలి

ప్రజాశక్తి - హిందూపురం

పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ప్రయోగాత్మకమైన విద్యను అందించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం ఉందన్నారు. సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ నమూనాలకు బహుమతులను మున్సిపల్ చైర్మన్ తదితరులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయోగాత్మక విద్యను అందించడం వల్ల విద్యార్థులకు ఆ విషయంపై ఎంతో అవగాహన పెరుగుతుందన్నారు. సరస్వతీ విద్యా మందిరాలలో క్రమశిక్షణ, భక్తితో కూడిన సాంప్రదాయ విద్యను అందిస్తుండటం అభినందనీయమన్నారు. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించడం వల్ల పిల్లలు సైన్సు కు సంబంధించిన విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాపీఠం సభ్యులు సత్యనారాయణ రెడ్డి, శ్రీకాంత్, ప్రకాష్, గోవిందరాజులు, సత్యనారాయణ, హేమావతి, రాధాకృష్ణ, రమేష్, పార్థసారథి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

ప్రకటనల్లోనే ఆర్భాటం.. ఆచరణలో విఫలం

గంటల తరబడి రాని ఆర్టీసీ బస్సులు
మహిళా ప్రయాణికుల పడిగాపులు
అధికారుల తీరుపై ఆగ్రహం


బస్సులో ఎక్కడానికి ప్రయత్నిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం నామమాత్రమే అన్న వాదనలు మహిళ ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈనెల 15న స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని ప్రారంభించింది. అయితే ఈ పథకం కార్యరూపం దాల్చకముందు కదిరి డిపో పరిధిలో ప్రతి రూట్ లో 10 నిమిషాలకు ఒక్కబస్సును ఆర్టీసీ అధికారులు నడిపేవారని ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చాక గంటకు ఒక్క బస్సు వస్తోందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతామని అటు ప్రభుత్వం ఇటు అధికారులు ఉపన్యాసాలు ఇచ్చారని ఈ పథకం ప్రారంభమై మూడు రోజులు అయినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవటం లేదని విమర్శిస్తున్నారు. గ్రామాలకు పట్టణాలకు మండల కేంద్రాలకు వెళ్ళే ప్రయాణికులు బస్సుల రాక కోసం ప్లాట్ ఫామ్‌లో గంటల తరబడి నిలబడుతున్నామని వాపోతున్నారు. అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రయాణికులు అధికారులను నిలదీస్తున్నారు. అదేవిధంగా అంతరాష్ట్ర పల్లెవెలుగు సర్వీసుల్లో సైతం ఉచిత బస్సు ప్రయాణం అమలు కాలేదని మహిళలు వాపోతున్నారు. కదిరి నుండి ఓడిసి, మహమ్మదాబాద్, అమడగూరు మీదుగా బాగేపల్లికి, అలాగే కదిరి నుండి కుంట్లపల్లి , తుమ్మల , అమడగూరు మీదుగా బిల్లూరుకి పల్లె వెలుగు బస్సులు రాక పోకలు సాగిస్తున్నాయి. ఈ బస్సులను ఆర్టీసీ అధికారులు అంతరాష్ట్ర సర్వీసులుగా పరిగణనలోకి తీసుకొని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయలేదు. ఈ సర్వీసులు దాదాపు 50 కిలోమీటర్ల మేర గ్రామాల మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రూట్ గుండా ప్రయాణించే మహిళలు తామేమీ పాపం చేశామని ప్రశ్నిస్తున్నారు. తాము ఉచిత బస్సు ప్రయాణానికి అర్హులం కాదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర ఆర్టీసీ అధికారులు స్పందించి ఈ బస్సులలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని వారు కోరుతున్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

శ్రామిక మహిళ సమన్వయ రాష్ట్ర కమిటి కోశాధికారి దయ రమాదేవి


సమావేశంలో మాట్లాడుతున్న దయా రమాదేవి

ప్రజాశక్తి - హిందూపురం

ఏ ప్రభుత్వాలు వచ్చినా, ఎన్ని కొత్త చట్టాలు తీసుకు వస్తున్నా మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని రాష్ట్ర శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కోశాధికారి దయ రమాదేవి, శ్రామిక మహిళ సంఘం నాయకురాళ్లు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు వత్తాసు పలుకుతూ నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. సోమవారం హిందూపురం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాలు లో సిఐటియు ఆధ్వర్యంలో శ్రామిక మహిళ సంఘం ఆధ్వర్యంలో దేశం, రాష్ట్రంలో మహిళపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, హింస, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా సదస్సు జరిగింది. అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కోశాధికారి దయ రమాదేవి మాట్లాడుతూ దేశంలో ప్రతి గంటకు ఎక్కడో ఒకచోట మహిళపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైనాయని, మహిళ రక్షణ కోసం నిర్భయ చట్టం, దిశా చట్టం, ఫోక్సో చట్టాలు ఉన్నప్పటికీ వీటి నుండి ఎలాంటి ఫలితం రావడం లేదని విమర్శించారు. ఈ చట్టాల అమలు విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయన్నారు. మూడేళ్ల పసిపాప నుండి 60 ఏళ్ల ముదుసలిపై కూడా ఘోరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లోకోట్ల మంది మహిళలు పనిచేస్తున్నారని, వీరికి పని ప్రదేశాల్లో మానానికి, ప్రాణానికి ఎలాంటి భద్రత లేకపోయిందని అన్నారు. ఈ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగానూ, పేదలకు వ్యతిరేకంగానూ పరిపాలిస్తోందని విమర్శించారు. కోట్లాది రూపాయలు ఉన్న కార్పొరేట్లపై 2శాతం పన్ను విధించడం ద్వారా ఒక్క నెలకు రూ.32 లక్షల కోట్లు ఆదాయం వస్తుందన్నారు, దీంతో ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అంగన్వాడి, ఆశా తదితర కార్మికులందరినీ రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ సమస్యల అన్నింటికీ పరిష్కార మార్గం పోరాటం తప్ప వేరే మార్గం లేదని, మహిళలంతా ఐకమత్యంగా పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, జిల్లా శ్రామిక మహిళ సంఘం కన్వీనర్ దిల్షాద్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఉషమ్మ, స్కూల్ స్వీపర్స్ రాష్ట్ర అధ్యక్షురాలు సరోజమ్మ, హిందూపురం సిఐటియు పట్టణ కన్వీనర్ విఆర్ రాము, కో కన్వీనర్ రామకష్ణ, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు అరుణ, ఐద్వా నాయకురాలు జ్యోతమ్మ, రంగమ్మ, శిరీష, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అండగా నిలుస్తోందని ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ మనోహర్ గౌడ్ అన్నారు. కల్లుగీత కార్మికులకు గతంలో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నెరవేర్చిందని హర్ష వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సోమవారం మనోహర్ గౌడ్ నివాసం వద్ద ఈడిగ గౌడ గీత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గీత కార్మికుల ముద్దుబిడ్డ సర్దార్ గౌతు లచ్చన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నందున ధన్యవాదాలు తెలిపారు. 2013-14సంవత్సరంలో నారా చంద్రబాబు నాయుడు పాదయాత్ర సమయంలో కల్లుగీత కార్మికుల కష్టాలను స్వయంగా తెలుసుకొన్నారన్నారు. కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు నాగేంద్ర గౌడ్, రామాంజి గౌడ్, కె. సరోజమ్మ, బి. శంకరప్ప గౌడ్, కె. బాబు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-లేపాక్షి

అనారోగ్యం కారణంగా చేనేత కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మండల కేంద్రమైన లేపాక్షిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరా లు.. మండలంలోని కంచిసముద్రం పంచాయతీ పరిధిలోని బయన్నపల్లి గ్రామానికి చెందిన ఆదెప్ప కుమారుడు లక్ష్మీపతి(41) చేనేత కార్మికుడు. అతడికి భార్య సుమిత్ర, 8 నెలలు కూతురు ఉన్నారు. అతడు భార్య పిల్లలతో కలిసి లేపాక్షిలో నివాసం ఉంటున్నాడు. ఇక్కడ చీరలు నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొన్ని రోజుల నుంచి కడుపు నొప్పి, విపరీతమైన తలనొప్పితో బాధపడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన లక్ష్మీపతి భార్య ఇంటి లోపల ఉండగా బయట వరండాలో ఉరి వేసుకొన్నాడు. గమంచిన భార్య కేకలు వేయగా చుట్టుపక్కల వారు వెంటనే అక్కడికి చేరుకుని అతడిని దింపి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హిందూపురం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలకు డిమాండ్


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్ల తో కూడిన వినతి పత్రాన్ని సోమవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్‌కి సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జెసిబిలతో, ట్రాక్టర్లులతో మట్టిని తవ్వి వందల లారీల మట్టిని తరలించడం వల్ల చెరువులు దెబ్బతిని భవిష్యత్‌లో రైతులు నీటి కొరతను ఎదుర్కోవాల్సి వస్తుందని, చెరువుల్లో గుంతలు పడి చెరువులకు దెబ్బ తింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అక్రమ దందాలో కొంతమంది అధికార పార్టీ నేతలతో పాటు ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ సంపద దోపిడీకి అనుమతిస్తున్నారని ఆరోపించారు. చెరువులు కాపాడకపోతే వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. చెరువుల సంరక్షణలో ఇరిగేషన్ అధికారులు విఫలం అయ్యారని విమర్శించారు. తక్షణమే అక్రమ మట్టి తవ్వకలపై విచారణ జరిపి మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లును, జెసిబిలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు : మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయని దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం నాయకులు అన్నారు. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో రమణమూర్తి కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ మధురేపల్లి, కమ్మయ్యగారిపల్లి సహా పలు గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలతో, రాళ్లతో నిండిపోవడంతో రాకపోకలు కష్టసాధ్యమైపోయాయనిఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం పడినా రోడ్లు బురదమయమై ప్రయాణం సవాలుగా మారుతోందన్నారు. విద్యార్థులు, రైతులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారి దుస్థితి కారణంగా మధురేపల్లి గ్రామంలో గతంలో నడిచిన ఆర్టీసీ బస్సులు కూడా రద్దయినట్లు తెలిపారు. వెంటనే రహదారి పనులు చేపట్టి ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, సుధాకర్, అశ్వర్థ రెడ్డి, మంజునాథ్, గోపాలప్ప, అశ్వర్థప్ప, తదితరులు పాల్గొన్నారు.

అర్హుల పింఛన్లు పునరుద్ధరించండి


కలెక్టరేట్‌కు వచ్చిన వికలాంగులు

ప్రజాశక్తి - తనకల్లు

అర్హులైన వారి పేర్లను వికలాంగుల పింఛను జాబితా నుంచి తొలగించారని వారి పింఛన్లను పునరుద్ధరించాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తనకల్లు మండలం వ్యాప్తంగా 300 పింఛన్లు తొలగించారన్నారు. గతంలో అధికారులు వెరిఫికేషన్ చేసి సదరం సర్టిఫికెట్ ఇచ్చి పింఛన్లు మంజూరు చేశారన్నారు. ఇప్పుడు అధధికారులు అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వి.వి. రమణ, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం. శివన్న, ఎస్వీ రమణ, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తోపు పారేసు, సిఐటియు జిల్లా నాయకులు వంటేద్దు వేమన్న, సిపిఎం నాయకులు చిన్న వెంకటరమణ, శ్రీనివాసులు, వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : వికలాంగుల పింఛను పొందుతున్న వారిని అనర్హులుగా ప్రకటించి తొలగించాలని వారికి పింఛను పునరుద్ధరించాలని సిపిఐ, బిఎస్పీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు బత్తలపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నరసింహనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటిమయ్య,బీఎస్పీ ధర్మవరం ఇన్చార్జ్ సాకే వినయ్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ బత్తలపల్లి మండల పరిధిలో 512 మంది పేర్లను వికలాంగుల పింఛన్ల జాబితా నుంచి అన్యాయంగా తొలగించారన్నారు. అందకు ప్రధాన కారణం వైద్యుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. వైద్యులు అంగవైకల్యాన్ని సరిగా ధ్రువీకరించకపోవడం, సక్రమంగా నమోదు చేయకపోవడమేనని అన్నారు. తొలగించబడిన 512 మంది వికలాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.నిర్లక్ష్యానికి కారణమైన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.పాత సదరం సర్టిఫికెట్లు పొందిన వారందరికీ న్యాయం చేయాలని కోరారు. జిల్లా బీసీ సంఘం సహాయ కార్యదర్శ కుమ్మర వెంకటరమణ, బత్తల నాగభూషణం, బాధితులు పాల్గొన్నారు.

వినతిపత్రం సమర్పించిన టిడిపి నాయకులు : వికలాంగుల పింఛను పొందుతున్న అర్హులైన వారిని అన్యాయంగా తొలగించాలని అధికారులు వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని టిడిపి మండల నాయకుల కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో నరసింహనాయుడును కలిసి ఆధారాలతో సహా అర్హులైన వివరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, జక్కంపూడి సత్యనారాయణ, మాజీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్ప,తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలో అర్హులైన వారిని వికలాంగుల పింఛను జాబితా నుంచి తొలగించారని అనర్హులకు చోటు కల్పించారని టిడిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక ఎంపిడిఒ నసీమా, ఇఒఆర్‌డి దివాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండవ నోటిఫికేషన్ విడుదల చేసి మండల వ్యాప్తంగా విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ నాయకులు గోపాల్‌రెడ్డి, రాంమోహన్, అశోక్, గంపన్న తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : అర్హత కలిగిన వికలాంగులకు పింఛను తొలగించారని వాటిని పరిశీలించి పునరుద్దించాలని జిల్లా వికలాంగుల సేవా సమితి అధ్యక్షులు గోకుల చక్రపాణి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరన్ శిబిరంలో అర్హులను అనర్హులుగా అనర్హులను అర్హులుగా గుర్తించి అసలైన అర్హులైన వికలాంగులకు అన్యాయం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వికలాంగులు పాపన్న, నాగమణి, రమణప్ప, రామాంజనమ్మ, నందిని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని జాతీయ హైవే లో సోమవారం ద్విచక్ర వాహనాన్ని టెంపుల్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో సోమందేపల్లి మండలం మండ్లి గ్రామానికి చెందిన కిషోర్ తీవ్ర గాయాల పాలైనట్లు పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చింతామణి నుండి కేబుల్ వైర్ పనులు నిర్వహించే టెంపో వాహనం పని ముగించుకుని రాయదుర్గం వైపుగా వెళ్తూ జాతీయ హైవేలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్రవాహదారుడు కిషోర్ తీవ్రంగా గాయపడ్డాడు. కాగా అదే వాహనంలో ఉన్న ఓ మహిళకు గాయాలయ్యాయి స్థానికులు 108కు సమాచారం అందించి ఇద్దరిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఈ సంఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని స్థానిక పోలీసులు చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల పరిధిలోని పాముదుర్తి గ్రామానికి చెందిన నారాయణస్వామి, గోవర్ధన్ అనే ఇద్దరు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన వెంకటరాముడు అనే వ్యక్తి ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో తన సొంత పనులపై పాముదుర్తి గ్రామానికి వెళ్లగా పాముదుర్తి గ్రామంలో నారాయణస్వామి, అతని కుమారుడు గోవర్ధన్ వెంకటరాముడుతో గొడవపడి గాయపరిచి కులం పేరుతో దూషించినట్లు వెంకటరాముడు ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎరువుల దుకాణాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల యజమానులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఏపీ రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, సోమిరెడ్డి తదితరులు సోమవారం ప్రజా వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ దేవేంద్ర నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో బస్తాపై యాభై నుండి వంద రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. నాణ్యత లేని ఎరువులు,విత్తనాలు విక్రయిస్తున్నారని,ధరల పట్టికను ప్రదర్శించకుండా ఎక్కువ ధరలకు అమ్ముతున్నారనిఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్ రెడ్డి, మల్లిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికి నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు, ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ సురేష్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాల చదివే విద్యార్థులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించడం లేదన్న విమర్శలున్నాయి. కొద్ది మంది నిర్వాహకులు (ఏజెన్సీలు) తమ స్వలాభం కోసం విద్యార్థుల కడుపు కొట్టే ప్రయత్నం చేస్తున్నారని, తద్వారా విద్యార్థులకు అర్ధాకలితో ఉంటున్నారని అన్నారు. ఏజెన్సీలుగా బాధ్యతలు తీసుకున్న నిర్వాహకులు విద్యార్థులు అందరికీ నాణ్యమైన భోజనం అందించే విధంగా చూడాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనాథ్,అమాన్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

టిడిపి ఆధ్వర్యంలో ట్రాక్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి - పరిగి

ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు ద్వారా రైతులకు అందిన సాయాన్నిగుర్తు చేస్తూ పెనుగొండ పట్టణంలో బీసీ సంక్షేమ చేనేత శాఖ మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీకి పరిగి మండల వ్యాప్తంగా టిడిపి నాయకులు తరలివెళ్లారు. టిడిపి మండల కన్వీనర్ ఎస్ ఎన్ గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100 ట్రాక్టర్లతో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కన్వీనర్ ఎస్ ఎన్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ నిధులతో రైతులకు ఎంతో మేలు జరిగిందని అన్నారు. మండలంలో 7437 మంది రైతులు ఉండగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ. 3.71 కోట్లు రైతుల ఖాతాలోకి జమ కాగా 96శ్శాతం రైతులు లబ్ధి పొందారన్నారు. పీఎం కిసాన్ ద్వారా రూ. 1.48 కోట్లు నగదు రైతుల ఖాతాలోకి జమ అయ్యిందని గోవిందరెడ్డి తెలిపారు. ట్రాక్టర్ల ర్యాలీ విజయవంతంలో తనతో పాటు పనిచేసిన 5 మాన్ కమిటీ సభ్యులు సూర్యనారాయణ, బాలాజీ, సోమప్ప, వెంకటేష్, సంజీవరాయప్ప కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగభూషణం, డిఎస్ఎల్ శ్రీనివాసులు, కంకర శ్రీనివాసులు, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీగా వెళుతున్న టిడిపి నాయకులు

ఆర్‌డిటి కోసం ర్యాలీ

ప్రజాశక్తి - నల్లమాడ

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలని కోరుతూ మండలకేంద్రంలో వందలాది మంది నాయకుల, ప్రజలు సోమవారం శాంతిర్యాలీ నిర్వహించారు. సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి తహశీల్దార్ రంగనాయకులుకు వినతపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి నాయక్ , డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, నాగరాజు నాయుడు, ఆదినారాయణ రెడ్డి,జి మని, రాంప్రసాద్ నాయక్ రాజేందర్ నాయక్, పొరకల రమణ ,బుజ్జి నాయక్ మంగే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

శింగనమల : నార్పల మండల కేంద్రం సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. జాబ్‌మేళాలో దాదాపు పదికిపైగా జాతీయ, మల్టీనేషనల్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్త తొలగింపులో అశ్రద్ధ తగదు

బత్తలపల్లి : చెత్త తొలగింపులో అలసత్వాన్ని విడనాడాలని మండల టిడిపి కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి సూచించారు. సోమవారం పారిశుధ్యకార్మికులతో సమావేశమై మండల కేంద్రమైన బత్తలపల్లి మేజర్ పంచాయతీలో పారిశుధ్య పరిస్థితులపై చర్చించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు, పనిముట్లు ఏర్పాటు తదితర వాటిపై అధికారులతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి నెట్టెం రమణ, యూనిట్ ఇన్‌ఛార్జి బత్తల మనోజ్ కుమార్, తెలుగుదేశం నాయకులు, గడుపుటి రమేష్ బాబు, చిత్రా నాగభూషణ, పంచాయతీ కార్యదర్శి ముత్యాలనాయుడు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ప్రజాశక్తి - హిందూపురం

స్థానిక సంస్థల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్గీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వటానికి హిందూపురం నుండి బిఎస్పీ నాయకుల వెళ్లకుండా అక్రమంగా అరెస్టు చేయడం తగదని ఆ పార్టీ నాయకులు విమర్శించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, కొల్లకుంట నాగరాజు ఆధ్వర్యంలో పుట్టపర్తికి వెళుతున్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈసందర్బంగా బిఎస్పీ నాయకులు మాట్లాడుతూ పోలీసుల సూచనల మేరకు ధర్నాలు నిర్వహించకుండా కేవలం వినతిపత్రాలు సమర్పించేందుకు అనుమతులు పొందినా అనుమతులు లేవంటూ పోలీస్ స్టేషన్ లో నిర్బంధించడం అన్యాయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బీసీల పట్ల నిజమైన ప్రేమ లేదని అన్నారు.బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కల్పించేదాకా బిఎస్పీ ఉద్యమం కొనసాగిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు చౌళూరు రామాంజనేయులు, దాసరి ఈశ్వరయ్య, సుబ్బరాయప్ప, గంగప్ప, మౌలాలి, హుస్సేన్, రమేష్, మధు, రరాజు రాజప్ప, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మార్పు వదంతులపై అలజడి

ప్రజా ప్రతినిధులు స్పందించాలని డిమాండ్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం మార్పు వదంతులపై జిల్లాలో అలజడి ప్రారంభమైంది. సత్యసాయి నిర్వాణం అయిన తర్వాత వ్యాపారాలు లేక స్తబ్ధతగా ఉన్న పుట్టపర్తి పరిసర ప్రాంతాలు జిల్లా కేంద్రంగా మారడంతో తిరిగి వ్యాపారాలు పుంజుకున్నాయి.రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. జిల్లా కేంద్రం ఏర్పాటుకు లో వెనుకబడిన ఈ ప్రాంతం అన్ని రంగాల అభివృద్ధి అవుతుందని భావించారు. అయితే ఇటీవల హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కోరిక మేరకు జిల్లా కేంద్రం మార్పు జరుగుతోందన్న ప్రచారంతో అందరిలోనూ నిర్లిప్తత చోటు చేసుకుంది. పట్టణంలోనే గాక జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ ఈ అంశం చర్చకు దారి తీసింది. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పడిన జిల్లాల్లో నియోజకవర్గాల్లో మండలాలు జిల్లా పేర్లు చేర్పులు, మార్పులపై మంత్రి వర్గ ఉప సంఘం నిర్ణయించింది. ఆ కమిటీ ప్రజా అభిప్రాయాలు సేకరించనుంది. ఈ నేపథ్యంలో అన్ని నియోజకవర్గాలకు మధ్యలో ఉన్న అన్ని మౌలిక సదుపాయాలు ఉన్న పుట్టపర్తి కేంద్రంగా జిల్లా కొనసాగించాలని డిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హిందూపురం కేంద్రంగా ఉండాలని వాదనను ఉప సంఘం దృష్టికి తీసుకు వచ్చే అవకాశాలూఉన్నాయి. ఈ విషయమై మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్పందించి తమ అభిప్రాయాలు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

డెంటల్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

హిందూపురం : హిందూపురం ప్రభుత్వాసుపత్రిలో డెంటల్ ల్యాబ్ ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆర్ఎస్పీ పార్టీ నాయకులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీనివాసులు మాట్లాడుతూ, గత 20 నెలలుగా డెంటల్ వైద్యం అందక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ల్యాబ్ లో జరుగుతున్న నిర్లక్ష్యాన్ని అధిగమించే విధంగా ఇక్కడ వైద్యం జరిగే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి తిప్పన్న, భాస్కర్, నరేంద్ర, నాయన పల్లి తిమ్మక్క, హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి' ద్వారా మూడు రోజుల్లోనే 75 వేలకు పైగా మహిళలకు లబ్ధి

డిపిటిఓ మధుసూదన్



మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ రవాణా శాఖ అధికారి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీ శక్తి పథకం ద్వారా జిల్లాలో మూడు రోజుల్లోనే 75, 402 మంది మహిళలకు లబ్ధి చేకూరిందని జిల్లా ఆర్టీసీ రవాణా శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పట్టణంలో కొన్ని బస్సులను తనిఖీ నిర్వహించి మహిళల అభిప్రాయం తెలుసుకున్నారు. ఆర్టీసీ సిబ్బంది మర్యాదగా ప్రవర్తిస్తున్నారా. ఉచిత బస్సు ప్రయాణం ఎలా ఉంది, బస్సులు సమయపాలన పాటిస్తున్నాయా. తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. బస్సుల లోని మహిళ ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు. మహిళలు ఈ పథకాన్ని చక్కగా వినియోగించుకోవాలని డిపిడిఓ కోరారు. అనంతరం డిపిడివో విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం ఈనెల 15న ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో 15వ తేదీన 19,766 మంది, 16న 28,619 మంది, 17న 44, 807 మంది, మొత్తం మీద ఈ మూడు రోజుల్లోనే 75, 402 మంది మహిళలు రూ.42,13,977ల లబ్ధి పొందాలని వివరించారు. ప్రయాణికులు కూడా ఆర్టీసీకి సహకరించాలని డిపిడిఒ కోరారు.

ధర్మవరం రూరల్ : ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ధర్మవరం బస్టాండ్‌ను తనిఖీ చేశూరు. స్త్రీ శక్తి పథకం అమలు గురించి అక్కడి మహిళా ప్రయాణికులకు తెలియజేశారు. సిటీ, మెట్రో, పల్లె వెలుగు, అల్ట్రా, ఎక్స్ ప్రెస్ బస్సులలో మాత్రమే రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చునని, ఆధార్ కార్డ్ చూపించి పూర్తిగా ఉచిత ప్రయాణం పొందవచ్చునని తెలిపారు. డిపో మేనేజర్ సత్యనారాయణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ తో పాటు కార్యాలయ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పేరుతో మోసం

బాధిత రైతు ఆవేదన

పుట్టపర్తి క్రైమ్ : కనగానపల్లి మండలం చంద్ర చర్ల గ్రామం రెవెన్యూ అధికారుల తప్పిదానికి ఓ రైతన్న నష్టపోయాడు. సబ్ డివిజన్ పేరుతో అధికారులు మోసం చేశారని ఆ రైతు వాపోతున్నారు. సోమవారం పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత రైతు తమ కుటుంబానికి జరిగిన ఆన్యాయాన్ని వివరించారు. దాదులూరు పొలం నందు 393 సర్వేనెంబర్ మొత్తం 25.99 ఎకరాల ఉన్న భూమిని 39.72 ఎకరాలు ఆన్‌లైన్ చేశారన్నారు. దీనికి సంబంధించి వివరాలు చెక్ చేయగా 393 సర్వేనెంబర్ ఆర్ ఎస్ ఆర్ ప్రకారంగా 393-1, 393-2 అని నమోదయిందన్నారు. 1932లో 393-1 ఏ,1 బి,1 సి అని మూడు సబ్ డివిజన్లు అయ్యాయయన్నారు. 393-1 బి 1983లో తమ నాన్న రాయపాటి శ్రీనివాసులు పేరు మీద 6.67 ఎకరాలు రిజిస్టర్ అయిందని అయితే 1993లో మా నాన్నకు తెలియకుండా రాయపాటి శ్రీరాములు, చిన్న నారాయణప్ప, బి.లింగమయ్య అనే ముగ్గురు కలిసి సబ్ డివిజన్ చేసి 393-1బి కున్న చుట్టు కొలతలు మార్చారని , సరిహద్దు యజమానుల పేర్లు కూడా మార్చారని ఆరోపించారు. దీనివల్ల ప్రస్తుతం 25.99 ఎకరా ఉన్న భూమి 39.72 ఎకరాలుగా ఆన్‌లైన్‌లో నమోదయిందన్నారు. కరెక్షన్ కోసం ఐదు సంవత్సరాల నుంచి తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా స్పందన లేకపోవటంతో కోర్టును ఆశ్రయించామన్నారు. దీనికన్నా ముందే పి జి ఆర్ ఎస్ ను సంప్రదించామన్నారు. తహశీల్దార్, సర్వేయర్ లాగిన్‌లో ఉన్న భూమి కొలవకూడదని చెబుతున్నారని, ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని బాధిత రైతు కోరాడు.

పరిహారం ఇప్పించి ఆదుకోండి

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామిక వాడలో గత జూన్ 10వ తేదీన మీనాక్షి స్టీల్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వలస కార్మికుడి కుటుంబానికి పరిహారం ఇప్పించి ఆదుకోవాలని కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ బీహార్ రాష్ట్రానికి చెందినటువంటి జిబ్లాల్ యాదవ్ (29) విధినిర్వహణలో ఉండగా మృతిచెందాడన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో వారి కుటుంబానికి యాజమాన్యం రూ.7.50 లక్షలు ఆర్ టి జి ఎస్ ద్వారా మృతుడి భార్యకు తల్లికి చెల్లించారన్నారు. అయితే రూ.8 లక్షల నగదు ఇచ్చినామంటూ న్యాయవాది ద్వారా ఒక నోటరీ సిద్ధం చేయించుకుని మృతుడి భార్య చేత సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. స్వగ్రామానికి వెళ్ళిన వెంటనే ఖాతాలోకి నగదు వేస్తామంటూ దళారీలు మోసం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.15,74,400 చెల్లించాలని యాజమాన్యానికి కార్మిక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. అయితే యాజమాన్యం నగదు చెల్లించకుండా చెల్లించామంటూ మృతుడి భార్య చేత సంతకం చేయించుకున్న ఆ నోటరీని కార్మిక శాఖ అధికారులకు చూపించారన్నారు. బాధిత కుటుంబం తమకు ఎటువంటి నగదు అందలేదని, పరిహారం నగదు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతోందన్నారు. ఈ మేరకు బాధితులు కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తే స్పందించిన కార్మిక శాఖ అధికారులు యాజమాన్యాన్ని ఫోను ద్వారా సంప్రదించగా తాము నగదు చెల్లించామని బుకాయిస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో కార్మిక శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, వినోద్ కుమార్, మారుతి రెడ్డి, షమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆరోగ్య పరిరక్షణ ముఖ్యం



విద్యార్థినులతో కలసి మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న మంత్రి సతీమణి

ప్రజాశక్తి - బత్తలపల్లి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధితో పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సతీమణి త్రివేణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాల,మాల్యవంతంలోని ఉన్నత పాఠశాలల్లో సంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ సంస్థ సహకారంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా నిర్మించిన రెండు ఆధునిక మరుగుదొడ్లను మంత్రి సతీమణి త్రివేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా త్రివేణి మాల్యవంతం పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డించి,మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. తన కుమారుడు కుమారుడు రిషి అద్వానీతో కలిసి మాల్యవంతం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, కూటమి నాయకులు ఆకులేటి భాస్కర్, గోనుగుంట్ల నారాయణరెడ్డి, ఆకులేటి వీరనారప్ప,గంటాపురం జగ్గు, పురం శెట్టి రవి,జక్కంపూటి నాగభూషణ, నెట్టెం రామకృష్ణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రం లోని,బీసీ బాలికల వసతిగృహం, జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాలలో విద్యార్థినిల అవసరాల నిమిత్తము సౌకర్యవంతమైన టాయిలెట్స్‌ను మంత్రి సతీమణి త్రివేణి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రమణ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ వినయ్, ఉపాధ్యాయులు లలిత, రేఖరాణి, చామంతి బీసీ హాస్టల్ వార్ధన్ లీలావతి, ఎంపీపీ ఆది, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : సంస్కృతి సేవా సంస్థ ఆధ్వర్యంలో, హిందుస్థాన్ కోకా కోలా బేవరేజెస్ కార్పొరేట్ సంస్థ సహకారంతో సిఎస్ఆర్ నిధుల ద్వారా పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహం, గొట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల కోసం నిర్మించిన మరుగుదొడ్లను మంత్రి సతీమణి త్రివేణి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జగన్నాథం, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వినయ్, బీసీ హాస్టల్ వార్డెన్ విష్ణువర్ధన్ రెడ్డి, బీసీ గర్ల్స్ హాస్టల్ వార్డెన్ జ్యోతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ అరుణశ్రీ, పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ అధ్యక్షులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'మీసమస్య-మాబాధ్యత'

రాప్తాడు : మండల పరిధిలోని పాలచర్ల గ్రామంలో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి నాయకులు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పంపుకొండప్ప, దగ్గుపాటి శ్రీనివాసులు, గంగుల కుంట కిట్ట, బ్రహ్మానందరెడ్డి, ముత్యాలప్ప, రాము, నారాయణస్వామి, రామునిపల్లి రాము, గోపాల్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు సోమవార ం మండలం లోని తోపుదుర్తి గ్రామంలో మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రామకృష్ణ, జి.శంకర్, నారాయణరెడ్డి, బోసి ఆదినారాయణ, లింగమయ్య, రాజేష్, సురేష్‌నాయుడు, చంద్రశేఖర్, డీలర్లు రాజన్న, పోతన్న, రాజు, రాజేంద్ర, శివానంద పాల్గొన్నారు.